టీడీపీ ఓటూ జగనన్నకే

- ప్రచారం తెలుగుదేశం పార్టీకి.. ఓటు మాత్రం ఫ్యాను గుర్తుకు
- ఇన్ని పథకాలు గతంలో ఎప్పుడూ అందుకోలేదంటున్న తమ్ముళ్లు
- పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్
- యాదమరిలో ఆసరా చెక్కుల పంపిణీ



యాదమరిలో మహిళలకు మెగా చెక్కు పంపిణీ చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్



జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

యాదమరి: రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన జగనన్నకు టీడీపీ శ్రేణులు కూడా ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారని పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పార్టీలు, కులాలు, మతాలకతీతంగా సంక్షేమ పాలన సాగిస్తున్న జగనన్న, టీడీపీ శ్రేణులనూ మురిపించేశారని చెప్పారు. పైకి మాత్రం టీడీపీని గెలిపించాలంటూ ప్రచారం చేస్తూనే, వారి కుటుంబ సభ్యుల ఓట్లు ఫ్యాను గుర్తుకే వేయాలంటూ ఇప్పటికే నిర్ణయించుకున్నారని ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.9.87 కోట్ల మెగా చెక్కును మహిళలకు పంపిణీ చేశారు. దీనికి విచ్చేసిన డాక్టర్ సునీల్‌కుమార్‌కు, నాయకులు,మహిళలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సమావేశంలో డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో గెలుపుకోసం అబద్ధపు హామీలు ఇచ్చి గెలిచిన తరువాత మోసం చేయడం చంద్రబాబు నైజం అని విమర్శించారు. కానీ జగనన్నకు ఎన్ని కష్టాలు వచ్చినా ఎంత మంది ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా ఇచ్చిన మాటను అమలు చేశారని పేర్కొన్నారు. అందుకే గ్రామాల్లో టీడీపీకి చెందిన వారు కూడా జగనన్నకు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో జగనన్న మళ్లీ గెలిస్తే ఈ పథకాలన్నీ అందుతాయన్న నమ్మకం అందరిలో దృఢంగా ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, ఎంపీడీఓ సింగన్న, వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, మనోహర్ రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

తవణంపల్లె: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయడమే లక్ష్యంగా పని చేసే కార్యకర్తలకు అండగా ఉంటామని డాక్టర్ సునీల్‌కుమార్ భరోసా నిచ్చారు. మండలంలోని అరగొండ టోటల్ హెల్త్ ఆవరణలో శుక్రవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకుల పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల పార్టీ అధ్యక్షులు హరిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు జి. ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ సునీల్‌కుమార్ అరగొండలోని వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు గజమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడ నుంచి ఆయన పార్టీ సీనియర్ నాయకులు అరగొండ రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో భారీ స్కూటర్ ర్యాలీతో సభావేదిక వద్దకు చేరుకున్నారు. సునీల్‌కుమార్ పార్టీ శ్రేణుల దగ్గరకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి జగనన్నను మరోసారి సీఎం పీఠంపై కూర్చో పెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ నియోజవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు మండలంలోని ఓటర్లు కీలకమన్నారు. మండల నాయకులందరూ కలసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యేను అత్యధిక మెజారిటీతో గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా పంపుతామని ముక్తకంఠంతో హామీ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు



టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

తవణంపల్లె: మండలంలోని కొత్తగొల్లపల్లెకు చెందిన టీడీపీకి చెందిన నాగరాజ్‌యాదవ్, మురుగేష్, చిన్నబ్బ, లక్ష్మణ్ శుక్రవారం మండల పార్టీ నాయకుల ఆధ్వర్యంలో డాక్టర్ సునీల్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు చూస్తే ఎవరైనా జగనన్నకు జైకొట్టాల్సిందేనన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గురుకువారిపల్లె ప్రకాష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు హరిరెడ్డి, వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, పార్టీ శ్రేణులు గాంధీబాబు, కిషోర్‌కుమార్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, రాజేశ్వరమ్మ, కిషోర్ రెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, మధుకుమార్, ఉమామహేశ్వరరెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, శ్రీరాములురెడ్డి, రవిరెడ్డితోపాటు కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పథకాలను వినియోగించుకోండి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసన్న కుమారి

పూతలపట్టు : రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థుల కోసం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రసన్నకుమారి తెలిపారు. మండలంలోని అమ్మేపల్లి ప్రాథమిక పాఠశాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ గతంలో కన్నా ఇప్పుడు విద్యావిధానం ఎంతో మెరుగ్గా ఉందని చెప్పారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మంచి స్థానంలో ఉండాలని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వండాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. అనంతరం మండలంలోని పాలవెల్లువ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఏపీఎం నాగరత్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ దుష్ప్రచారం తగదు



పల్లెచెరువులో మాట్లాడుతున్న సర్పంచ్ లావణ్య

తవణంపల్లె: టీడీపీలో తాను చేరినట్లు ఆ పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారాలు అవాస్తమని పల్లెచెరువు సర్పంచ్ లావణ్య తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు గ్రామానికి వచ్చి ప్రచారం చేసినప్పుడు తన ఇంటికి వచ్చారని చెప్పారు. ఇంటికి వచ్చిన వారితో సర్పంచ్ హోదాలో మాట్లాడానే తప్ప తాను టీడీపీలో చేరలేదని స్పష్టం చేశారు. తాను వైఎస్సార్‌సీపీ కి విధేయురాలిగానే ఉన్నానని, ఇక ఎప్పటికీ జగనన్నకు మద్దతుగానే పని చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుజిత్‌రెడ్డి, హేమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలపై కసరత్తు



సుధాకర్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి, జిల్లా పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఎస్పీకి నివేదిస్తూ పోలీసుశాఖను సమన్వయం చేస్తామని చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్‌రెడ్డి అన్నారు. ఏసీబీ నుంచి అటాచ్‌మెంట్‌పై సుధాకర్‌రెడ్డిని చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేయగా.. శుక్రవారం ఆయన ఇక్కడ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఎస్పీ జాషువాను మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీ మాట్లాడుతూ గతంలో జిల్లాలో పనిచేసిన అనుభవం ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఉపయోగపడుతుందన్నారు.

ప్రమాదరహిత డ్రైవర్లకు సత్కారం



డ్రైవర్‌ను సత్కరిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్: చిత్తూరు ఆర్టీసీ టూ డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా డీపీటీఓ నాగేశ్వరరావు, డీటీసీ నిరంజన్ రెడ్డి, డిపో మేనేజర్లు పాల్గొన్నారు. వారు ప్రసంగిస్తూ డ్రైవర్లు ప్రశాంతంగా, ఏకాగ్రతతో బస్సులు నడపాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవర్లపై ప్రయాణికులు పూర్తి నమ్మకంతో మన బస్సుల్లో ప్రయాణిస్తారని చెప్పారు. గత 30 సంవత్సరాలు ప్రమాదానికి తావు లేకుండా డ్రైవింగ్ చేసిన డ్రైవర్లను సత్కరించారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పూతలపట్టు : మండలంలోని పి.కొత్తకోట బస్టాండ్ వద్ద శుక్రవారం ఎయిడ్స్ నిర్మూలన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత బృందం వారు అంబేడ్కర్ చౌక్ వద్ద నాటిక మరియు పాటలు పాడి అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కళాజాత బృందం నాటికను ప్రారంభించారు. వైద్యాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ, ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒకటే మార్గం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో కార్పొరేట్ వైద్యం



బంగారుపాళెం: కల్లూరు పల్లెలో వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంధ్యారాణి

బంగారుపాళెం: గ్రామాల్లో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కల్లూరుపల్లె సర్పంచ్ బాలాజీ, ఎంపీటీసీ సభ్యురాలు స్వాతికపలాపతి అన్నారు. మండలంలోని కాటప్పగారిపల్లె గ్రామ సచివాలయం పరిధి కల్లూరుపల్లెలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్లు 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ, ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోనే పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నిపుణులైన వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి జబ్బు తీవ్రతను బట్టి మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసు కుంటోందన్నారు. గ్రామీణులకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వరమని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్ రాయన్, డాక్టర్లు శాలిని, సంధ్యారాణి, ఎంపీహెచ్‌ఈఓ రమేష్ బాబు, గ్రామ కార్యదర్శులు, ఆరోగ్య, అంగన్‌వాడీ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ





ఎంపీడీఓ శివశంకర్‌ను అభినందిస్తున్న సిబ్బంది, ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న కుసుమకుమారి

బంగారుపాళెం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా(ఎంపీడీఓ) శివశంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వైఎస్సార్ కడప జిల్లా రామాపురం నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. శివశంకర్‌కు ఎంపీపీ అమరావతితోపాటు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఐరాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా కుసుమకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ నాగరాజు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న కుసుమకుమారికి ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

నేత్రపర్వంగా రథసప్తమి వేడుకలు



సూర్యప్రభ వాహనంపై పుర వీధులలో ఊరేగుతున్న ఇంద్రవరదస్వామి



రథసప్తమి సేవలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: నగరంలోని పలు ఆలయాల్లో రథసప్తమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈశ్వరగుడి వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారు పలు వాహనాల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఊరేగింపుగా వస్తున్న స్వామివారికి భక్తులు కర్పూర హారతులు పట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వరదరాజస్వామి ఆలయంలో స్వామి వారు వాహన సేవల్లో కనువిందు చేశారు.

గో మహత్యం భక్తి ప్రదాయకం

గో మహత్యం అత్యంత భక్తి ప్రదాయకమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి వివరించారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా వరదరాజస్వామిని దర్శించుకున్న ఆయన గో ప్రాముఖ్యతను భక్తులకు చెప్పుకొచ్చారు. అనంతరం స్వామి సేవలో పాల్గొన్ని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



వరదరాజుల స్వామి ఆలయంలో భక్తుల సందడి

సూర్యప్రభ వాహనంపై ఇంద్రవరదుడు

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన ఇంద్రవరదుడు సూర్యప్రభ వాహనంపై పుర వీధుల్లో విహరించారు. శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడు సూర్యప్రభ వాహనంపై కొలువుదీరి పుర వీధుల్లో విహరించారు. భక్తులు స్వామివారికి కర్పూర మంగళహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

గరుడ వాహనంపై శ్రీరామచంద్రుడు



తవణంపల్లె: స్థానిక కోదండరామాలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. రాత్రి గరుడ వాహనంపై శ్రీరామచంద్రుడు కొలువుదీరి పురవీధుల్లో భక్తులను కటాక్షించారు. అదే విధంగా పైమాఘంలో రథసప్తమిని పురస్కరించుకొని ముత్యాలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఊరేగించారు. పైమాఘంలో శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహించారు.

హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా ర్యాలీ

యాదమరి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీఓ నెం. 106-2, హిట్, రన్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని యాదమరి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డ్రైవర్లు, క్లీనర్లు ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆయిల్ కంపెనీల్లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, క్లీనర్ల పిలుపుమేరుక ర్యాలీ నిర్వహించి బంద్ చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకపోతే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో డీఎస్పీ సుధాకర్‌రెడ్డి



చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్బీ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఉన్నతాధికారులను కలిశారు. కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు అంశాలపై కాసేపు చర్చించారు.

విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉండాలి



విజేతకు బహుమతి అందజేస్తున్న అతిథులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు పరీక్షల సమయంలో ఫోన్లు, టీవీలు వంటి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యులు ద్వారకనాథరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని సంతపేట వద్ద ఉన్న బృందావన్ పాఠశాలలో 11వ వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం ఆ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ అలరించాయి. విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల చైర్మన్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో మేయర్ అముద, కమిషనర్ అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలు అభివృద్ధి పనులను పాలకవర్గం ఆమోదించింది. కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మేయర్ ఎస్.అముద అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కమిషనర్ అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జీఆర్ శ్రీకాంత్, సహదేవన్, శోభ, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించి ఆమోదించారు. అజెండాలో భాగంగా నగరంలోని దర్గా కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడానికి రహదారి భద్రతా నిధులు, కార్పొరేషన్ సాధారణ పద్దుల నుంచి నిధులు వెచ్చించడానికి కమిటీ ఆమోదించింది. రానున్న వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాల్లో ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి ఆమోదం. అర్హులైన అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేసేందుకు ఇరువారం రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 515/5లో తహసీల్దార్ గుర్తించిన 8.45 ఎకరాలు భూస్వభావమును మార్పు చేసేందుకు పరిశీలన నిమిత్తం పంపగా కమిటీ ఆమోదించింది. ప్రభుత్వ ఉత్తర్వు ల మేరకు డోర్ టు డోర్ గార్బేజ్ సేకరణ నిమిత్తం నడుస్తున్న 11 ఆటో టిప్పర్లకు సంబంధించి డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, మెకానిక్ మరియు డీజిల్ బకాయిలను నెలవారీ బిల్లు నుంచి మినహాయించుకుని చెల్లించడానికి, స్వీపింగ్ మిషన్ వాహనాలను నగర పాలక సంస్థ నిర్వహణ షరతుల మేరకు వారి సేవలు కొనసాగించేందుకు కమిటీ ఆమోదం ముద్ర వేసింది. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, మునిసిపల్ ఇంజనీరు గోమతి, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న ఇంటి వద్దనే మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సవటపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 75 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



భూమి పూజ చేస్తున్న లోకేష్ రెడ్డి

పూతలపట్టు : పేదలందరూ సొంతింటి కలను సాకారం చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాన్ని ఇచ్చి, నిర్మాణానికి కావలసిన నగదును అందజేసిందని వైఎస్సార్ సీపీ నాయకుడు లోకేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని ముత్తిరేవుల గ్రామంలో శుక్రవారం లబ్ధిదారుని ఇంటికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు.

ఫ్యాను ప్రభంజనానికి సిద్ధం కండి

తవణంపల్లె: ఈ ఎన్నికల్లో ఫ్యాను ప్రభంజనం సృష్టించడానికి పార్టీ శ్రేణులందరూ సమష్టిగా కృషి చేయాలని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ కోరారు. ఆయన అరగొండలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, అనంతపురం జిల్లాలోని రాప్తాడులో ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న ×సిద్ధం₹ కార్యక్రమానికి అందరూ సన్నద్ధం కావాలని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో గూడు కట్టుకుంటే, కుట్రలు, దోపిడీలకు పాల్పడిన చంద్రబాబు పొత్తుల కోసం పరుగులు తీస్తున్నారని దుయ్యబట్టారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య



ఆనందయ్య మృతదేహం

బంగారుపాళెం: అనారోగ్యంతో మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పురుషోత్తం తెలిపారు. హెచ్‌సీ కథనం మేరకు.. మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన ఆనందయ్య (65) పదేళ్లుగా క్యాన్సర్ జబ్బుతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ జబ్బు నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైన ఆయన గ్రామానికి సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.